క్లుప్తంగా

పక్షవాతం బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు ఆదివారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన సిరిపరపు శ్రీను గత రెండు సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటూ వైద్యం చేయించుకుంటున్నాడు. ఇతని ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వైద్య ఖర్చులకు చాలా ఇబ్బంది పడుతున్నాడు. స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరగా అతనికి రూ.10 వేల ఆర్థిక సాయం సేవా సమితి సభ్యులు అందజేశారు.

సుబ్బారావు కుటుంబానికి పరామర్శ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారానికి చెందిన మాజీ ఇన్‌చార్జి ఎంపీడీఓ విత్తనాల సుబ్బారావు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావులు ఆదివారం పరామర్శించారు. సుబ్బారావు కుమారుడు శేఖర్, కుటుంబ సభ్యుల్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. తొలుత సుబ్బారావు చిత్రపటం వద్ద ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్‌లు శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీపీలు దొమ్మేటి వెంకటేశ్వరరావు, కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, డెల్టా చైర్మన్ కుడుపూడి బాబు, బండారు శ్రీదేవి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

కొత్తపేట: మండలంలోని వాడపాలెం పెదపేటలో ఈ నెల 3న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు న్యాయవాది అజ్జరపు రాజ్‌కమల్ తెలిపారు. రాజమహేంద్రవరం డెల్టా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, స్రవంతి డెంటల్, నేత్ర హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో వైద్య నిపుణులు ఆయా విభాగాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ జరుగుతుందన్నారు. మండలంలో ఆయా వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజ్‌కమల్ కోరారు.

ప్రధాని మోదీకి మద్దతుగా నిలవండి



బెల్లంపూడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వేమా తదితరులు

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీకి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరుతూ బీజేపీ నేతలు ఆదివారం నగరంలో కరపత్రాలు పంచా రు. ఇంటింటికీ తిరిగి తొమ్మిదేళ్ల మోదీ పాలనలో చేపట్టిన సంస్కరణలు, అభివృద్ధి పనుల్ని ప్రజలకు వివరించారు. పేదలకు ఇళ్ల ఆహార భద్రత, రైతులకు చేయూత, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, జాతీయ రహదారులు, గ్రామీణ రహదారుల అభివృద్ధి వంటి ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. గృహ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెల్లంపూడిలో మండల బీజేపీ ఉపాధ్యక్షుడు తిక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో వారు ఇంటింటికీ తిరిగి మోదీ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంచారు. మండల శాఖ అధ్యక్షుడు వై.సాయిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమా, చిట్టిబాబు మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మ ఒడి చెక్కుల పంపిణీ

అంబాజీపేట: సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టిబాబు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమమే లక్ష్యం

- మొదలైన 'జగనన్న సురక్ష' క్యాంపులు
- 28 వరకూ సచివాలయాల వారీగా కార్యక్రమాలు
- గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తి, టోకెన్ల జారీ



ముక్కామలలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల జేసీఎస్ కన్వీనర్ (ఫైల్)

అంబాజీపేట: అర్హులైన ఏ ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందకుండా ఉండకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' పేరుతో మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 29న అధికారికంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆరంభించినప్పటికీ, జూలై 1వ తేదీ నుంచి అసలు కార్యక్రమం ప్రారంభమైంది. నాలుగు వారాల పాటు జరగనున్న కార్యక్రమంలో అనేక రకాల ప్రజా సమస్యలను పరిష్కరించనున్నారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా వివక్షతకు తావు లేకుండా నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంకల్పంగా గత నెల 24 తేదీ నుంచి ఇంటింటి సర్వే మొదలైంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు వారం రోజుల పాటు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. అర్హత ఉండి పథకాలు అందని లబ్ధి పొందని వారిని గుర్తించారు. వారి నుంచి పథకం పొందేందుకు కావలసిన పత్రాలను సేకరించారు. వాటిని సచివాలయంలో అందించి, టోకెన్ నంబర్లు జారీ చేశారు. సర్వీసు రిక్వెస్ట్ నంబరు ఆధారంగా క్యాంప్ జరిగే రోజు సంబంధిత సచివాలయానికి అర్జీదారు వచ్చేలా చర్యలు తీసుకుని వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. అదే విధంగా మిగిలిన గ్రామాల్లోనూ సమస్య ఉన్న వారిని గుర్తించి టోకెన్లు జారీ చేశారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 76, కొత్తపేట నియోజకవర్గంలో 87, రాజోలు నియోజకవర్గంలో 73 సచివాలయాలు ఉన్నాయి.

రోజంతా సచివాలయంలోనే..

జగనన్న సురక్ష క్యాంప్ పకడ్బందీగా జరగనుంది. తహసీల్దార్ ఆధ్వర్యంలో ఈవోపీఆర్డీ, వ్యవసాయాధికారి, పీఆర్ ఏఈ, ఎంఈవో, హౌసింగ్ ఏఈలు ఒక బృందం, ఎంపీడీవో నేతృత్వంలో డిప్యూటీ తహసీల్దార్, ఎంఈవో–2, ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓలు రెండో బృందంగా నిర్ణీత తేదీల్లో ఆయా గ్రామాల సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

సర్వీసు ఫీజు లేకుండా సర్టిఫికెట్లు

ఇదిలా ఉంటే సచివాలయాల్లో ఎలాంటి సర్వీసుకు ఫీజులు లేకుండా 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా జారీ చేయనున్నారు. జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, లావాదేవీ మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, సీసీఆర్‌సీ కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు చేర్పులు.

> **పక్కాగా జగనన్న సురక్ష కార్యక్రమం**
>
> 
>
> జగనన్న సురక్ష కార్యక్రమం పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్వే పూర్తి చేశారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికీ నూటికి నూరు శాతం లబ్ధి చేకూర్చి, పథకాలు అందించడమే కార్యక్రమ ఉద్దేశం.
>
> – కె.సత్యనారాయణ, ఎంపీడీఓ, అంబాజీపేట

స్వామివారి సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి



అంతర్వేది ఆలయంలో జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఏపీ హైకోర్టు జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద జడ్జి వెంకటేశ్వర్లుకు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు జడ్జి, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, జడ్జి వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ విజయసారథి పాల్గొన్నారు.

స్వామి దర్శనంలో ఐఏఎస్ శారదాదేవి

అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఏపీ రాష్ట్ర యూత్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ కె.శారదాదేవి(ఐఏఎస్) కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద కమిషనర్ శారదాదేవికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. అలాగే ఆదివారం సెలవు కావడంతో సుమారు నాలుగు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఏసీ సత్యనారాయణ చెప్పారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



జి.అగ్రహారంలో నూతనంగా నిర్మించిన రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమయ్యే రహదారుల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివారు ప్రభాకర్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన గ్రావెల్ రోడ్డును సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పూర్వం నుంచి సరైన మార్గం లేక ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులకు అవసరమైన ఎంపీపీ, జనరల్ ఫండ్ నిధులు రూ.5 లక్షలతో రహదారిని నిర్మించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాయుడు షణ్ముఖ్, ఎంఎం శెట్టి, రాయుడు కృష్ణమహేష్, రాయుడు చంటి, పులిదిండి ఏడుకొండలు, మట్టపర్తి యజ్ఞశ్రీ, నాగాబత్తుల సత్యనందం, నందుల ఆదినారాయణ, బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



జి.అగ్రహారంలో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తూ, అభివృద్ధి సంక్షేమం, దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతున్న పని చేసే ప్రభుత్వం కావాలా? ప్రజల్ని దోచుకునే దగాకోరు ప్రభుత్వం కావాలో ప్రజలే నిర్ణయించుకునే రోజులు ఆసన్నమవుతున్నాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గడగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకూ సంక్షేమ పథకం అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హులై ఉండి పథకం పొందలేని వ్యక్తుల్ని ఇంటింటికీ వెళ్లి వెతకమని వలంటీర్లను పంపడం, సీఎం జగనన్న సుపరిపాలనకు నిదర్శనమన్నారు. కాలనీల్లో రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని, ఇళ్ల పట్టాలు ఇచ్చారు కానీ స్థలాలు చూపించలేదని, స్థలాలు ఇచ్చినా ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, హౌసింగ్ లోన్లు ఇప్పించాలని ఎమ్మెల్యే చిట్టిబాబును స్థానిక మహిళలు కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమయ్యే అన్ని వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. త్వరలోనే ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బ్రోచర్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, రాయుడు షన్ముఖ్, ఎం.ఎం.శెట్టి, పులిదిండి మంగాదేవి, రాయుడు చంటి, దొమ్మేటి నాగన్న, బండారు శ్రీదేవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



నరేంద్రపురంలో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం కెనడీ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దేశ, విదేశాల్లో స్థిరపడిన 1997–98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు స్థానిక నాయకుడు గణేశుల శ్రీవెంకట కొండలరావు ఆధ్వర్యంలో ఆదివారం స్కూలుకు విచ్చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఆనందించారు. ఒకరినొకరు సెల్ఫీలు తీసుకుని ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమలాపురంలో రక్షా హాస్పిటల్ నిర్వహిస్తున్న డాక్టర్ ప్రభావతిని తోటి విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కరోనాలో మరణించిన సుబ్రహ్మణ్యం, చెన్నారావు, ప్రవీణ్‌కు నివాళులు అర్పించారు. పాఠశాల అధ్యాపక సిబ్బంది, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

‘అమృత్ సరోవర్’లో చెరువు ఆధునీకరణ



ఉపాధి హామీలో చేపట్టిన ఈదరాడ చెరువు అభివృద్ధి పనులు

మామిడికుదురు: ఈదరాడ గ్రామంలో శివాలయం ఎదురుగా ఉన్న చెరువును మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చెరువులో పూడికను పూర్తిగా తొలగించి, చెరువు గట్లను బలోపేతం చేసే పనులు నిర్వహిస్తున్నారు. రూ.4.20 లక్షలు అంచనాతో, 1400 పనిదినాలతో ఈ చెరువు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈదరాడ, కరవాక తదితర గ్రామాలకు చెందిన కూలీలు చెరువు ఆధునీకరణ పనుల్లో పాల్గొన్నారు. మే నెలలో చెరువు ఆధునీకరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈదరాడకు చెందిన కూలీలు చెరువు పనులు నిర్వహిస్తున్నారు. ఇంత వరకు 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనుల్ని త్వరలోనే పూర్తి చేయిస్తామని చెరువు పనుల్ని పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు, ఉపాధి హామీ పథకం జేఈ పేరాబత్తుల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆగస్టు 15న ఈ చెరువుగట్టున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రగతి పథంలో వానపల్లి సొసైటీ



వానపల్లి సహకార సంఘం కల్యాణ మండపం

కొత్తపేట: వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఎంచుకుని పంటలు సాగు చేసే కొందరు రైతుల సభ్యత్వాలతో ఏర్పడిందే సహకార వ్యవస్థ. సహకార సంఘాలు రైతులకు వ్యవసాయ రుణాలిస్తూ, సాగు చేసే పంటలకు ఎరువులు విక్రయిస్తూ, భూస్వాములు, ధనికుల నుంచి డిపాజిట్లు సేకరిస్తూ ఆర్థికంగా బలోపేతమయ్యాయి. అటువంటి వాటిలో కొత్తపేట మండలం వానపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ఒకటి. ఈ సంఘం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తూ ఆదర్శ సంఘంగా గుర్తింపు పొందింది. ఈ సొసైటీని 1957 మే 31న స్థాపించారు. అప్పట్లో 200 మంది సభ్యులు, రూ.10 లక్షలతో ప్రారంభమైన సంఘం రైతులకు వివిధ సేవలు అందిస్తూ ఇంతింతై వటుడింతై అన్న చందాన నేడు 2,200 మంది సభ్యులతో రూ.24 కోట్ల టర్నోవర్‌కు చేరి అభివృద్ధి పథంలో పయనిస్తుంది. సొసైటీ భవనంపై కల్యాణ మండపాన్ని నిర్మించారు. దానిని సోమవారం ప్రారంభించనున్నారు. 1995లో బండారు రాజా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే నాటికి ఈ సంఘం రూ.80 లక్షల టర్నోవర్‌తో నడుస్తుండగా నేడు రూ.24 కోట్ల టర్నోవర్‌కు చేరింది.

బ్యాంక్ అభివృద్ధి

2013లో రూ.7.50 లక్షలతో బ్యాంక్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, 2014లో రూ.6 లక్షలతో గొడౌన్ల నిర్మాణం, 2020లో శిథిలావస్థకు చేరిన భవనం స్థానే రూ.60 లక్షలతో నూతన భవన నిర్మాణం, గొడౌన్‌పై రూ.60 లక్షలతో ఫంక్షన్ హాలు (కల్యాణ మండపం) నిర్మాణం, రూ.10 లక్షలతో ఫంక్షన్ హాలుకు భోజన, వంటశాల నిర్మాణం, సీడీఎఫ్ నిధులు రూ.8 లక్షలతో ప్రహరీ నిర్మాణం

నేడు కల్యాణ మండపం ప్రారంభం

ఈ సొసైటీ ద్వారా విశాలమైన ఫంక్షన్‌హాలు నిర్మించారు. ఈ నిర్మాణాలను పీఏసీఎస్ అధ్యక్షుడు బండారు రాజా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ ఆకుల వీర్రాజు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

పదవులను ప్రజాసేవకు వినియోగించాలి



పలివెలలో దేవస్థానం పాలకమండలి సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా వచ్చిన పదవులను ప్రజాసేవకు వినియోగించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. మండలంలోని పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి వారి దేవస్థానం, పలివెల ధర్మసత్రం పాలకమండళ్ల ప్రమాణస్వీకారం, అభినందన కార్యక్రమం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పలివెల ధర్మసత్రం హాలులో ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం ఆ పార్టీ నాయకులుగా మనందరికీ గర్వకారణమన్నారు. పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి దేవస్థానం, ధర్మసత్రం పాలకమండళ్లు భక్తుల సేవలో తరించాలని సూచించారు.

దేవస్థానం పాలకమండలి చైర్మన్‌గా భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ, సభ్యులుగా అత్తిలి శ్రీదేవి, పెండ్యాల శ్రీదేవి, కంకటాల వీవీ శ్రీరామమూర్తి, గుబ్బల గంగారత్నం, మాగాపు శ్రీనివాస్, సబ్బితి మంగాయమ్మ, గొలకోటి చంద్రకేశవ, మల్లవరపు వీరభద్రరావు, కొడమంచిలి వీఎస్ఎస్ శర్మ, ధర్మసత్రం చైర్మన్‌గా చప్పిడి సాయిబాబా, చిర్రా లక్ష్మి, చిచ్చారి శ్రీనివాసరావు, గుండుపల్లి సుబ్బలక్ష్మి, దిగుమర్తి బేబీలలిత, జల్లి వెంకటేశ్వరరావు, విన్నకోట ఫణిరాఘవేంద్రరావు నియమితులు కాగా వారితో జగ్గిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని అభినందిస్తూ శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ గునిపే శ్యామల, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌లు పానుగుపాటి సత్యనారాయణ, ముసునూరి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బౌద్ధస్తూపం వద్ద ఆషాఢ పౌర్ణమి వేడుకలు



ఆదుర్రు బుద్ధ విహార్‌లో ప్రార్థనల్లో పాల్గొన్న బుద్ధ విహార్ ట్రస్టు ప్రతినిధులు

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలోని పురాతన ఆది బౌద్ధ స్తూపం వద్ద ఆదివారం ఆషాఢ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా బౌద్ధ స్తూపం చుట్టూ బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి అంటూ ప్రదక్షిణ చేశారు. బుద్ధ విహార్ ట్రస్టులోని బుద్ధుని విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆధ్యాత్మిక గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్ఎస్ఆర్ భూపతి, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, భయ్యా మోహన్, పులపర్తి కృష్ణమూర్తి, తోట రామారావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో



కిషోర్‌కుమార్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

సఖినేటిపల్లి: మండల రెగ్యులర్ విద్యాశాఖాధికారి(ఎంఈవో)గా డి.కిషోర్‌కుమార్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సఖినేటిపల్లిలో ఎంఈవో కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న ఆయనకు ఆ శాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇంత వరకూ ఎంఈవో (ఎఫ్ఏసీ)గా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

బేడబుడగ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

కొత్తపేట/పి.గన్నవరం: బేడబుడగ జంగాలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇప్పించాలని ఆ వర్గీయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బేడబుడగ జంగాల అధ్యక్షుడు కల్యాణం ఏడుకొండలు, సంఘ పెద్దలు యు.సత్యం తదితరుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీవో ఎం.ముక్కంటిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే పి.గన్నవరంలోనూ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మాదిరిగానే మన రాష్ట్రంలో బేడబుడగ జంగాలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని కోరుతూ పి.గన్నవరంలో ఎమ్మెల్యే చిట్టిబాబుకు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గాప్రసాద్ తదితరులు వినతిపత్రం సమర్పించారు.

గురుపౌర్ణమికి ఘనంగా ఏర్పాట్లు

మామిడికుదురు/ఆలమూరు: ఈ నెల 3వ తేదీ సోమవారం జరగనున్న గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు షిర్డీసాయిబాబా ఆలయాల వద్ద భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పెదపట్నం మొగలికుదురు, మామిడికుదురు, మగటపల్లి, లూటుకుర్రు, బి.దొడ్డవరం, పాశర్లపూడి, తదితర గ్రామాల్లో కూడా గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలమూరులోనూ గురుపౌర్ణమి సందర్భంగా పలు బాబా ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి ధనలక్ష్మమ్మ తీర్థం

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో వేంచేసిన ధనలక్ష్మి అమ్మవారి జాతర, తీర్థం సోమవారం నుంచి జరగనున్నాయి. సోమవారం ఉదయం అమ్మవారికి పసుపు నీళ్లతో నింపిన 108 కలశాలను గ్రామ ఆడపడుచులు ఊరేగింపుగా తీసుకువెళ్లి అభిషేకం చేయనున్నారు. రాత్రి జాతర, మంగళవారం తీర్థం జరపనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

ఆర్టీసీ బస్ ఢీ: ఇద్దరికి గాయాలు

కొత్తపేట: మండలంలోని ఖండ్రిగ వద్ద ఆర్టీసీ బస్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ఏఎస్సై డి.శశాంక తెలిపిన వివరాలిలా.. మోడేకుర్రు గ్రామానికి చెందిన కొండేటి బాలవెంకటపతి అతడి బావ మన్యం ధనరాజుతో కలసి బైక్‌పై ఆదివారం ఆలమూరు మండలం కొత్తూరులో బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా ఖండ్రిగ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న కారును తప్పించబోయి బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని ఢీకొంది. దీంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికుల 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.

పలివెల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ‘తులా’



తులా సూర్యనారాయణ

కొత్తపేట: మండలంలోని పలివెల గ్రామ పార్టీ అధ్యక్షుడిగా తులా సూర్యనారాయణ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వస్కా చిరంజీవి, కార్యదర్శులుగా నాయుడు వెంకటేశ్వరరావు, అవిడి వీర్రాజు, సహాయ కార్యదర్శులుగా చొల్లంగి శ్రీనివాసరావు, బయ్యే సూరిబాబులను నియమించారు. తనను గ్రామ పార్టీ అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి, సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.70 వేల సాయం

రాజోలు: కువైట్‌లో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన పితాని శ్రీనివాస్ కుటుంబానికి గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ ఆదివారం రూ.70 వేల ఆర్థిక సాయం అందజేసింది. అలాగే శెట్టిబలిజ యువసేన సమకూర్చిన రూ.3 వేల ఆర్థికసాయాన్ని రాష్ట్ర నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, ఎంపీపీ కేతా శ్రీనివాస్ అందజేశారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ సేవలను పలువురు అభినందించారు. సర్పంచ్ నక్కా రామారావు, రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, గుబ్బల శ్రీనివాస్, కడలి కపిల్ తదితరులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపానికి రూ.75,558 విరాళం

ఆలమూరు: బోణువు చెరువు సమీపాన నిర్మిస్తున్న శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపానికి పలువురు కాపు నేతలు ఆదివారం విరాళాలను అందజేశారు. మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు నివాసంలో జరిగిన సమావేశంలో గతంలో ఇరువురు దాతలు ప్రకటించిన రూ.75,558 విరాళాన్ని అధ్యక్షుడు ప్రభాకరరావుకు అందజేశారు. చొప్పెల్లకు చెందిన గానుగుల పట్టాభిరామన్న తమ తల్లిదండ్రులు గానుగుల వెంకట్రావు–రమణమ్మల జ్ఞాపకార్థం రూ.50,558 అందజేశారు. తోరాటి శివ, సతీష్ సోదరులు రూ.25 వేలు అందజేశారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన ట్రక్



పంటకాలువలోకి దూసుకెళ్లిన ట్రక్

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం సమీపాన చాకలి చెరువు వద్ద మలుపు పంటకాలువలోకి ఆదివారం హెవీ వెహికల్ ట్రక్ దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. కేశవదాసుపాలెం నుంచి టేకిశెట్టిపాలెం వెళ్తున్న ఖాళీ ట్రక్ చెరువు వద్ద మలుపులో అదుపు తప్పింది. ఈ తరుణంలో రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి, సరాసరి పంటకాలువలోకి దూసుకెళ్లింది.

నిరుపేదకు ఆర్థిక సాయం

మామిడికుదురు: పెదపట్నం గ్రామానికి చెందిన నిరుపేద కోరుకొండ మేరీగోల్డ్‌కు ప్రమాదంలో చేయి విరిగింది. ఆమె కుటుంబానికి స్థానిక సిద్ధార్థ యువజన సంఘం ఆదివారం రూ.5 వేల ఆర్థిక సాయం అందించింది. సంఘం అధ్యక్షుడు గోగు శరత్ కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.